విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



2



2

అత్యవసర చికిత్సకు అక్కరకు రాని హెల్త్‌కార్డు..

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com

## వినాయక చవితి ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



**అక్షరటుడే, బోధన్:** వినాయక చవితి ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఆర్డీవో విజయ్ కుమారి సమీక్ష నిర్వహించారు. మండపాల వద్ద ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వినాయక నిమజ్జనం చేసే ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ, బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.

11-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## అలీసాగర్‌పై తీగల వంతెనకు ప్రతిపాదనలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అలీసాగర్‌పై తీగల వంతెనకు ప్రతిపాదనలు పంపనున్నట్లు అడిషనల్ కలెక్టర్ భుజంగరావు పేర్కొన్నారు. శుక్రవారం అలీసాగర్‌ను సందర్శించిన ఆయన.. ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్క్, ఉద్యానవనం, బోటింగ్ పాయింట్, హరిత హోటల్‌ను సందర్శించారు. హరిత హోటల్‌లో పర్యాటకుల వివరాలను తెలుసుకున్నారు. అలాగే బోటింగ్ సిబ్బందికి పర్యాటకుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాబోయే రోజుల్లో అలీ సాగర్‌ను అభివృద్ధి పర్చడానికి కాంపౌండ్ వాల్, తీగల వంతెన, రాత్రి విడిది కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.




## బీఆర్ఎస్ పార్టీకి పుట్టగతులుండవ్ : నగేష్ రెడ్డి

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి పుట్టగతులుండవని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నగేష్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానాలను పక్కాగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఫార్మ్‌హౌజ్ రాజకీయాలు చేస్తోందన్నారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ సూచనల మేరకే బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కేసీఆర్‌ను నిద్రలేపేందుకు తమ పార్టీ నాయకులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో వెయ్యి డప్పులతో నిరసన కార్యక్రమం తెలియజేస్తే ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుభ్రం చేయడం దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి ఇందిర శోభన్ మాట్లాడుతు ప్రతి పక్ష నాయకుడిగా అసెంబ్లీకి రాకుండా ప్రజాధనం వృథా చేసున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.24కోట్లు ఖర్చు చేశారని, కేవలం వెయ్యి రోజుల్లో కేవలం మూడు రోజులు మాత్రమే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారన్నారు. ఇటువంటి ప్రతిపక్ష నాయకుడు ఉండటం మనకు సిగ్గుచేటన్నారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శరత్, రత్నాకర్ గౌడ్, గాదారి గోపి, ప్రవీణ్ గౌడ్, బున్నే రవిందర్, యాదగిరి, సంతోష్, లింగం, ఫిషిరీస్ ఛైర్మన్ శ్రీనివాస్, భక్తవత్సలం, రేవతి, పోల ఉషా, స్వప్న, రాజేంద్ర ప్రసాద్, రఘు, సాయికుమార్, గణేష్, సుభాష్, రవి పాల్గొన్నారు.

## 12న జాతీయ లోక్ అదాలత్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. శనివారం జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ పరిధిలోని న్యాయ సేవా సదన్‌లో జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో అన్ని రకాల కేసుల పరిష్కారానికి అవకాశం ఉందన్నారు. రాజీమార్గమే రాజమార్గమని సూచించారు.

# వైద్యశాఖలో నియంత పాలన

**వైద్య శాఖ అంటేనే నిమిషం విరామం లేకుండా ప్రజల ప్రాణాలు కాపాడే పవిత్రమైన రంగం. కానీ, నిజామాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం మాత్రం ఒక మానసిక నరకకూపంగా మారింది. సమీక్షా సమావేశం అంటే సలహాలు, సూచనలు ఇచ్చే వేదిక కాదు.. ఉద్యోగులను అణచివేసే, అవమానించే అరాచక స్థావరం!**

**- అక్షరటుడే, నెట్‌వర్క్**




■ అధికారం పేరిట ఆధిపత్యం.. ■ మాటలతో ఉద్యోగులకు వేధింపులు
■ 'కోటరీ' రాజ్యాంగం నడుస్తోందని ఆరోపణలు ■ ఉన్నతాధికారులు దృష్టిసారించాలని వేడుకోలు

నల్ల మొఖాలు, దొంగలు, మీ మొఖం చూడాలంటే అసహ్యం.. మీరంతా వేస్ట్, మీకు జీతం ఇవ్వడం దండగ, ఉద్యోగం మానేసి ఇంట్లో కూర్చోండి!" – ఇవీ ఒక ఉన్నతాధికారి నోటి నుంచి నిత్యం జాలువారే 'అమృత' వాక్యాలు!

▶ **వ్యక్తిగత అవహేళనలు:** సమీక్షలో అందరి ముందూ నిలబెట్టి, ఉద్యోగానికి సంబంధం లేని వ్యక్తిగత విషయాలను లాగుతూ వెటకారంగా మాట్లాడటం సదరు అధికారికి అలవాటు.

▶ **నోరెత్తితే వేధింపులే:** "ఇది తప్పు" అని ఏ ఉద్యోగి అయినా సాహసించి చెప్పాడా.. అంతే సంగతులు! "నోరు మూయ్, వీడికి పనీ చేతకాదు, వీడిపై ఫైల్ పుట్ అప్ చేయ్" అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు.

▶ **రాజీనామాలు, లాంగ్ లీవ్‌లు..** ఇవే సమాధానాలు! ఈ అధికారి వేధింపులు తాళలేక వ్యవస్థ ఎంతగా అతలాకుతలమైందో చెప్పడానికి ఇవే ఉదాహరణలు:

▶ సదరు అధికారి ధోరణి నచ్చక ఒక డిప్యూటీ డీఎంహెచ్‌వో స్థాయి అధికారి ఏకంగా రెండు నెలల లాంగ్ లీవ్‌పై వెళ్లాల్సి వచ్చింది.

**కక్షసాధింపు చర్యలు:** ఎదురు తిరిగిన వారికి సెలవులు మంజూరు కావు, జీతాల్లో కోతలు, ఎంక్వైరీలు, వరుస మెమోల జారీతో మానసికంగా వేధించి లొంగదీసుకుంటారు.

▶ ఆరేళ్లుగా నమ్మకంగా పనిచేసిన ఒక ఉద్యోగి మనస్తాపంతో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు.

▶ అనుబంధంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీవో) ఉద్యోగులు సైతం ఈ వేధింపులు భరించలేక వైదొలిగారు.

▶ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను అసలు మనుషులుగానే చూడకుండా, టెర్మినేట్ చేస్తామని, ఏజెన్సీలకు అటాచ్ చేస్తామని బెదిరించడం నిత్యకృత్యమైంది.

### 'కోటరీ' రాజ్యాంగం!

జిల్లా స్థాయి అధికారులు డిపార్ట్‌మెంట్ సమస్యలను విన్నవించుకుందామని వస్తే.. "నాకు చెప్పొద్దు, ఉన్న వాటితోనే చేయండి.. లేదా ఉద్యోగం మానేయండి" అని కఠినంగా ముఖం మీదే చెప్తారు.

▶ అయితే, తన సొంత 'కోటరీ' చెప్పే మాటలను మాత్రం కళ్ళు మూసుకుని వింటారని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఒక సీనియర్ అసిస్టెంట్ ఈ అధికారికి చేదోడువాదోడుగా ఉంటూ, ఆర్థిక వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

▶ ప్రభుత్వ నిబంధనలు పక్కనబెట్టి, సమీక్షల పేరిట నడిచే ఈ 'దర్బార్'లో కింది స్థాయి ఉద్యోగుల నుంచి సమాన హోదా కలిగిన సివిల్ సర్జన్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వోల వరకు ఎవరికీ మినహాయింపు లేదు. దీంతో వారు మానసికంగా ఇబ్బంది పడుతున్నారు.

### బదిలీ అయినా మళ్లీ వాలారు.. బెదిరింపులు పెంచారు!

గతంలో ఈ అధికారి వేధింపులపై ఉద్యోగ సంఘాలు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ఉద్యోగులు ఆనందంతో మిఠాయిలు పంచుకుని, వాట్సాప్ స్టేటస్‌లు కూడా పెట్టుకున్నారు.

▶ కానీ, అంతలోనే ఏ అభయహస్తం లభించిందో తెలియదు.. తను తిరిగి అదే సీటులో వాలారు! వచ్చీ రాగానే.. "నేను వెళ్ళిపోతాను అనుకున్నారా? వెళ్ళాను, తిరిగి వచ్చాను.. మిమ్మల్ని అస్సలు వదలను" అంటూ స్టేటస్‌లు పెట్టుకున్న వారిపై కక్షగట్టి మరీ వేధిస్తున్నారు.

▶ " డిప్యూటీ డీఎంహెచ్‌వో స్థాయిలోనే ఉండి కూడా మనం ఏమీ చేయలేకపోతున్నాం.. ఆఖరికి అధికారిపై తిరగబడితే ఎక్కడ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతారోనని భయపడాల్సి వస్తోంది" అని ఒక అధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

▶ ఉద్యోగులు భయం లేకుండా నిజాలు చెప్పడానికి అనువుగా వారి అభిప్రాయాలను గోప్యంగా సేకరించి, శాఖను ఈ 'నియంత' పిడికిలి నుంచి కాపాడాలని బాధితులు కోరుతున్నారు.

### కలెక్టర్ విచారణ చేపట్టాలి!

ఒక అధికారి నియంతృత్వ వైఖరి వల్ల జిల్లా వైద్యారోగ్య శాఖ వ్యవస్థాత్మకంగా పతనం అవుతోంది. మానసిక ప్రశాంతత లేక నిత్యం నరకం చూస్తున్నామని ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, సదరు అధికారి వ్యవహార శైలి, ఉపయోగించే భాష, ఆర్థిక లావాదేవీలు, తన కోటరీపై పూర్తి స్థాయి అంతర్గత విచారణ జరిపించాలి.

## జనగణనలో కులగణనను తప్పనిసరి చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జనగణనలో కులగణనను తప్పనిసరి చేస్తూ ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే ప్రాంగణంలో బీసీల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జరిగే జాతీయ జనగణనలో బీసీ కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించిందని, కానీ ఇప్పుడు శాస్త్రీయ పద్ధతిలో కాకుండా ఓబీసీ కాలమ్ లేకుండా రెండోసారి జనగణన ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. శాస్త్రీయంగా లెక్కించకపోతే వేల కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని, పారదర్శకంగా ప్రతి కులాన్ని నమోదు చేయాలని అన్నారు. కొందరు బీసీ వ్యతిరేకులు కులగణనను తప్పుదారి పట్టించేందుకే రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం చేస్తున్నారని, వారంతా దేశద్రోహులేనని విమర్శించారు. కేంద్రం స్పందించి కులగణన చేర్చకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కోఆప్షన్ సభ్యుడు కుంబాల రవి దీక్షకు మద్దతు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తాహెర్ మహమ్మద్ సైతం దీక్షకు మద్దతిచ్చారు. లలిత, సిద్ధరాములు, గణేష్ నాయక్, తాహెర్, మల్లన్న, ఎల్లయ్య, రాజయ్య, వెంకటస్వామి, విఠల్, రమేష్, ప్రవీణ్, హాజీజ్ పాల్గొన్నారు.

## భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ




**అక్షరటుడే, భీమ్‌గల్:** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య శుక్రవారం భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను, కంప్యూటర్ విభాగం పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో '5ఎస్ ' విధానం అమలు తీరును, వాహనాల పార్కింగ్ వ్యవస్థను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు సిబ్బంది ప్రత్యేకచర్యలు తీసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా దానికి బానిసైతే కౌన్సెలింగ్ ఇచ్చి మార్పు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌ల పట్ల ప్రజలు మోసపోకుండా నిరంతరం చైతన్య పరచాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ జె.వెంకటేశ్వర్ రెడ్డి, భీమ్‌గల్ సీఐ పొన్నం సత్యనారాయణ గౌడ్, ఎస్సై సీహెచ్ తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జల్సాల కోసం చోరీలు.. అన్నదమ్ముల ముఠా గుట్టురట్టు




**అక్షరటుడే, కామారెడ్డి:** జల్సాలకు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి చోరీలు చేస్తున్న అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. నెలలుగా భిక్కనూర్, రాజంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాల శివార్లలో 29 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ కాయిల్స్ చోరీకి గురైనట్లు అసిస్టెంట్ ఇంజినీర్ జాదవ్ బాలాజీ ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయి. సెప్టెంబర్ 9న రామేశ్వరపల్లి శివారులో చోరీ చేస్తుండగా అడ్డుకున్న లైన్‌మన్ ప్రభాకర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై కూడా కేసు నమోదైంది. దీంతో ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో భిక్కనూర్ సీఐ జగడం నరేష్, సీసీఎస్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సైలు అనిల్, మహేష్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి భిక్కనూరు మండలంలోని పరివార్ హోటల్ వద్ద మరొక చోరీ చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు నలుగురు సొంత అన్నదమ్ములని గుర్తించారు. మేడ్చల్‌కు చెందిన బల్జీర్ సింగ్ చతుర్ సింగ్ టాక్, రూప్ సింగ్ చతుర్ సింగ్ టాక్, లకన్ చతుర్ సింగ్ టాక్‌గా పోలీసులు గుర్తించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వీరు గతంలోనూ దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ పద్ధతి మార్చుకోకుండా పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రివేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శుక్రవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా పరిశీలించారు. రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సూచన మేరకు గతంలో దరఖాస్తు చేసుకోలేని వారు కోసం వారంరోజుల క్రితం తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సేకరించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం డబుల్ బెడ్ రూంల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి అర్హుల జాబితా తయారు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో అధికారులు డబుల్ బెడ్ రూంలను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, తహశీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## భక్తి భావంతో ఉత్సవాలు నిర్వహించాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** వినాయక ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. ధన్‌పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మార్వాడీ గల్లీలో ఉన్న కార్యాలయంలో వినాయక ఉత్సవ నిర్వాహకులకు చందాలు రాశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూరు యువత భక్తి మార్గంలో నడవాలని సూచించారు. వినాయక ఉత్సవాలను హిందూ సాంప్రదాయం ప్రకారం ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఏడాది తమ ట్రస్టు ద్వారా సహకారం అందిస్తామని గత సంవత్సరం 725 మండపాలకు అందించినట్లు పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఈ ఏడాది కూడా వచ్చిన వారందరికీ తన వంతు సహకారం ఉంటుందన్నారు. వినాయకుడు కేవలం ఒక పండుగకు సంబంధించిన దేవుడు కాదని సంస్కృతి సనాతన ధర్మం ఐక్యతకు ప్రతీక అని చెప్పారు.

## కేజేఎల్ పౌల్ట్రీ గేటు ఎదుట కార్మికుల ధర్నా!



**అక్షరటుడే, కామారెడ్డి :** భిక్కనూరు మండల కేంద్రంలోని కేజేఎల్ పౌల్ట్రీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, కార్మిక చట్టాల ప్రకారం దక్కాల్సిన సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. గత రెండేళ్లుగా యాజమాన్యం తమకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు తెలిపారు. నెలవారీ జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 1వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేసి తమ ఇబ్బందులను తొలగించాలని కోరారు. సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నప్పటికీ తమకు ఇప్పటివరకు కార్మిక గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించలేదని కార్మికులు ఆరోపించారు. యాజమాన్యం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి




**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రతి వ్యక్తి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో అమూల్యమైనదని ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం ఉపాధ్యాయులు నిరంతరం చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని పాత బాన్సువాడ హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణానికి చెందిన గురు మణిదీప్, కె. పవన్ కుమార్‌ల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు అందించిన స్టీల్ వాటర్ బాటిళ్లు, ఇతర బహుమతులను కాసుల బాలరాజు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు పి. కల్పన,మాజీ ఏఎంసీ ఛైర్మన్లు గురు వినయ్ కుమార్, నార్ల రవీందర్, కౌన్సిలర్ దొంకంటి శ్యామల వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## బీఎడ్ కళాశాలల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** బీఎడ్ కళాశాలల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ అడ్మిన్ బిల్డింగ్‌లోని రిజిస్ట్రార్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, జీవీఎస్, డీఎస్‌వో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎన్‌సీటీఈ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఎడ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని నాలుగు రోజుల క్రితం వర్సిటీ ఎడ్యుకేషన్ సెల్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రఘురాం, విగ్నేష్, అనిల్, రాథోడ్ జైత్రం రామ్, గోపీచంద్, గోపాల్ సింగ్ ఠాగూర్, వినీత్, సూర్యపాల్, సుభోద్, నీరజ్, సన్ని, నగేష్, మహి, రామ్ చరణ్ పాల్గొన్నారు.



# విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు..

■ అల్లాడుతున్న ప్రజలు ■ మూడు రోజుల్లో 500కి పైగా జ్వరపీడితులు
■ అవసరమైతే అడ్మిట్ చేసుకుంటున్నామంటున్న వైద్యులు

**సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలతో ఒక్క రోజులోనే కేవలం గాంధారి మండలంలోని సామాజికి ఆరోగ్యకేంద్రంలో 303 మందికి వైద్యులు చికిత్స అందించారు. అయితే మండలంలోని 45 జీపీలకు ఒకే ఒక్క ప్రభుత్వాస్పత్రి .. దాంట్లోనూ 30 పడకలే ఉండడంతో రోగులు అవస్థలుపడుతున్నారు.**

**– అక్షరటుడే గాంధారి**

గాంధారి మండలం జ్వర పీడితులతో అల్లాడుతోంది. 45 జీపీలకు ఒకే సామాజికి ఆరోగ్యకేంద్రం ఉండడంతో వైద్యాధికారులు, సిబ్బంది సైతం రోగులకు పరీక్షలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. క్రిటికల్ కేసులు మాత్రమే అడ్మిట్ చేసుకుంటున్నామని.. మిగతా వారిని చికిత్స అందించి ఇళ్లకు పంపుతున్నామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు

**మూడు రోజుల్లోనే..**

మూడు రోజుల్లో 500 మందికి పైగా సీజనల్ జ్వరాలతో బాధపడి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. ఒక్కరోజులోనే 303 మంది రోగులకు వైద్య చికిత్స అందించగా రోగుల తాకిడి అంతకంతకూ పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు.

**పరిసరాల అపరిశుభ్రత..**

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వర్షాల




కారణంగా సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్‌తో పాటు జలుబు, దగ్గు, గొంతునొప్పి, శరీర నొప్పులు, నీరసం వంటి సమస్యలతో పలువురు ఆస్పత్రులకు వస్తున్నారన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు.

**ముప్పై బెడ్లు ఎవరికి సరిపోతాయి..**

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు గాంధారి ప్రభుత్వ ఆస్పత్రి విచ్చేసినప్పుడు 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మారుస్తానని మాటిచ్చారు. తదనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే 45 గ్రామపంచాయతీలకు దాదాపుగా వంద పడకలు ఆస్పత్రి అయినా తక్కువేనని కాని 100 పడకల ఆస్పత్రిగానైనా అప్‌గ్రేడ్ చేయాలని రోగులు కోరుతున్నారు.

### అవసరమైతే అడ్మిట్..

సీజనల్ వ్యాధులు పెరిగాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా సీహెచ్‌సీకి రోగులు విపరీతంగా పెరిగారు. మూడురోజుల్లోనే 500మంది బాధితులు వచ్చారు. అయితే పడకలు తక్కువగా ఉన్నందున కేవలం అత్యవసర చికిత్స మాత్రమే సీహెచ్‌సీలో చేస్తున్నాం. ఇక మిగిలిన వారికి ట్యాబ్లెట్లు, ఇంజిక్షన్లు ఇచ్చి మళ్లీ రావాలని చెబుతున్నాం.

**– సంగీత్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్**




## లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో అన్నదానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో శుక్రవారం రాజరాజేంద్ర చౌరస్తా, కోటగల్లి, గాంధీచౌక్ తదితర ప్రాంతాల్లో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు అధ్యక్షుడు పి.రాఘవేందర్ బాబు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు క్లబ్ కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్, యువమిత్ర యూత్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి అల్లాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు

**అక్షరటుడే, నందిపేట్:** మండలంలోని షాపూర్ గ్రామంలో గ్రామపంచాయతీ మంచినీటి సరఫరాకు ఉపయోగించే విద్యుత్ మోటార్ల కోసం నూతనంగా 63 వాట్స్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఎర్రం హన్మాండ్లు మాట్లాడుతూ.. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల గ్రామ ప్రజల తాగునీటి సమస్యకి ఉపశమనం లభించిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఏడీఈ అశోక్, ఏఈ రమేష్, ఏఎల్ఎం అరుణ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఉప సర్పంచ్ నీరడి రాములు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌కు 20 బ్లడ్‌ప్రెషర్ మిషన్లు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని మనోరమా హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా. శిరిపల్లి శ్రీనివాస్ జీజీహెచ్‌కు 20 మాన్యువల్ బ్లడ్ ప్రెజర్ అపరాటస్‌లను విరాళంగా అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందజేసినట్ల ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ రాములు.. శిరిపల్లి శ్రీనివాస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలను విరాళంగా అందించడం ద్వారా రోగుల వైద్య సేవలకు తోడ్పాటు అందించారన్నారు.



## బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్ట్



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ క్రమంలో పలువురు బీఆర్ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్వీ ఎలాంటి నిరసనలకు పిలుపు ఇవ్వకపోయినా కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పాడుతోందని బీఆర్ఎస్వీ నిజామాబాద్ రూరల్ కన్వీనర్ చిరంజీవి పేర్కొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి




**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు చందూరి హన్మండ్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నస్రుల్లాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. చందూరి హన్మాండ్లు మాట్లాడుతూ.. సర్దార్ వల్లభభాయ్ పటేల్ చొరవతో పాటు ఎందరో మహానుభావుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన పోరాటంలో అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా తెలంగాణ చరిత్రను, అమరవీరుల త్యాగాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధంగా అధికారికంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు లక్ష్మణ్, ధనుంజయ్, నెమలి సర్పంచ్ రాంగోపాల్ రెడ్డి, శేఖర్, సాయిలు, భాస్కర్, సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మణ్, పవన్ పాల్గొన్నారు.

## ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి





**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ధర్నాకు దిగారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌బీఐ, సెబీ, ఎల్ఐసీ వంటి సంస్థలకు ఇప్పటికే ఐదురోజుల పనివిధానం అమల్లో ఉందన్నారు. అయితే బ్యాంకులకు కూడా ఈ విధానం అమలు చేస్తే తప్పేమిటని ప్రశ్నించారు. బ్యాంకు ఉద్యోగులు పనివేళలు ముగిసినప్పటికీ ఆ రోజు పనిని పెండింగ్‌లో పెట్టకుండా పూర్తిచేస్తున్నారన్నారు. సెలవు దినాల్లోనూ విధులు నిర్వర్తించాల్సి వస్తోందన్నారు. సాంకేతికత పెరిగినా పనిభారం మాత్రం తగ్గడం లేదని వాపోయారు.


## అత్యవసర చికిత్సకు అక్కరకు రాని హెల్త్‌కార్డు..



**అక్షరటుడే, బాన్సువాడ:** జన్యుపర చర్మ సమస్యతో పుట్టిన పసికందుకు అత్యవసర వైద్యం అందించాల్సిన పరిస్థితిలో వారి దగ్గర ఉన్న హెల్త్‌కార్డు అక్కరకు రాకుండా పోయింది. ప్రభుత్వ ఉద్యోగికి అందుబాటులో ఉన్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) కార్డు పనికి రాకపోవడంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రైవేటు ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందించేందుకు నిరాకరించడంతో రోజూ రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. కామారెడ్డి జిల్లా మహమ్మద్‌నగర్ మండలం మక్దూంపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహమ్మద్ షఫీక్‌కు ఆగస్టు 21న కూతురు జన్మించింది. పుట్టినప్పటి నుంచే చిన్నారి చర్మంపై పెద్దపెద్ద పొక్కులు ఏర్పడి, చర్మం ఊడిపోతూ తీవ్ర గాయాలు అవుతున్నాయని తల్లిదండ్రులు తెలిపారు. శరీరమంతా గాయాలు విస్తరించడంతో మెరుగైన వైద్యం కోసం ఆగస్టు 27న సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చిన్నారిని తీసుకెళ్లారు. అత్యవసర చికిత్స అవసరమని వైద్యులు సూచించడంతో చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించారు. అయితే అక్కడ ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా నగదు రహిత వైద్యం అందదని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు షఫీక్ తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించి చిన్నారిని ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పారు. ప్రస్తుతం 15 రోజులుగా చికిత్స కొనసాగుతోంది. చిన్నారికి చికిత్సతో పాటు తల్లిదండ్రులు ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుండటంతో మందులు, వైద్యఖర్చులతో పాటు భోజనం, వసతి తదితర ఖర్చులు కూడా అదనంగా అవుతున్నాయని షఫీక్ వాపోయారు. రోజుకు వేలాది రూపాయలు ఖర్చవుతున్నాయని, చికిత్స ఇంకా ఎంతకాలం కొనసాగుతుందో తెలియని పరిస్థితిలో మొత్తం బిల్లు ఎంత అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. తమ పాపను ఈహెచ్‌ఎస్ కార్డులో చేర్చుకున్నామని, గత నాలుగు నెలలుగా ఆరోగ్య పథకం కోసం తన వేతనం నుంచి ప్రతినెలా డబ్బులు మినహాయిస్తున్నారని షఫీక్ తెలిపారు. అవసరమైన సమయంలో అదే ఆరోగ్య పథకం ద్వారా నగదు రహిత వైద్యం అందకపోవడం బాధాకరంగా ఉందన్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఈహెచ్‌ఎస్ పరిధిలో నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని షఫీక్ కుటుంబం కోరుతోంది.

## ఒకే స్కాన్.. రెండు రిపోర్టులు.. మహిళ ప్రాణాలతో స్కానింగ్ సెంటర్ చెలగాటం




**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని ఏకైక ఎంఆర్ఐ స్కాన్ సెంటర్ నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. ఒకే బ్రెయిన్ స్కాన్‌కు రెండు రకాల రిపోర్టులు ఇచ్చి, ఒక మహిళ ప్రాణాలతో చెలగాటమాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ 8న 55 ఏళ్ల మహిళకు నగరంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో ఎంఆర్ఐ బ్రెయిన్ స్కాన్ చేశారు. పేషెంట్ వద్ద రూ.6వేలు తీసుకుని అదే రోజు ఇచ్చిన మొదటి రిపోర్టులో మెదడులో రక్తస్రావం అయ్యిందని పేర్కొన్నారు. ఆ రిపోర్టు ఆధారంగానే ప్రైవేట్ వైద్యుడు ఒక రోజు పాటు చికిత్స అందించారు. కానీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో న్యూరో వైద్యుడి వద్దకు వెళ్లగా అసలు విషయం బయటపడింది. స్కాన్ ఫిల్మ్‌కు, రిపోర్టుకు పొంతన లేదని గుర్తించిన న్యూరో వైద్యుడు స్కాన్ సెంటర్‌ను నిలదీశారు. దీంతో తప్పు జరిగిందని అంగీకరించిన సెంటర్ నిర్వాహకులు సెప్టెంబర్ 9న రెండో రిపోర్టు ఇచ్చారు. అందులో మెదడులో రక్తం గడ్డకట్టిందని పేర్కొన్నారు. మొదటి రిపోర్టులో రక్తస్రావం అని, రెండో రిపోర్టులో రక్తం గడ్డకట్టడం అని పూర్తి విరుద్ధమైన అంశాలు ఉండటం గమనార్హం. వైద్యుల ప్రకారం హెమరేజ్, ఇన్ఫార్క్ట్ రెండూ పూర్తి భిన్నమైనవని, రెండింటికీ చికిత్స కూడా పూర్తిగా వ్యతిరేకంగా ఉంటుందని తెలుస్తోంది. ఒకే స్కాన్‌కు, ఒకే రేడియాలజిస్టు పేరుతో రెండు విరుద్ధ రిపోర్టులు ఎలా ఇచ్చారనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. తప్పుడు రిపోర్టు వల్ల తమ కుటుంబ సభ్యురాలు ఒకరోజు పాటు తప్పుడు చికిత్స తీసుకోవాల్సి వచ్చిందని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.